క్లుప్తంగా

పత్తి పంట సాగుపై అవగాహన

రాయికోడ్(అందోల్): మండలంలోని సింగితం గ్రామ శివారులో రైతు శివరాజ్ సాగు చేసిన పత్తిపంట క్షేత్ర సందర్శనకు నూజివీడు సీడ్స్‌వారి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల రైతులను తీసుకువెళ్లారు. శివకుమార్ నవనీత ఎస్‌సీఎస్ రకం విత్తనంతో పత్తిని సాగు చేయగా పంట ఎదుగుదల పూత, కాత తదితర అంశాలను రైతులు క్షేత్ర సందర్శనతో తెలుసుకున్నారు. కార్యక్రమంలో రిజనల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఏరియా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, కంపెనీకి ప్రతినిధి నవనీత, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పవన్‌రెడ్డి కంపెనీ డీలర్స్ నవీన్, దశరథ్, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలమురళీకృష్ణ

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలమురళీకృష్ణ అలియాస్ చిన్న ముదిరాజ్‌ను నియమించినట్లు డీసీసీ జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజయప్రకాశ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బాల మురళీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ చోట్ల మూడు బెల్టుదుకాణాలపై శనివారం ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు సీఐ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో వివిధ బ్రాండ్లకు చెందిన 6.48లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

జహీరాబాద్ టౌన్: ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేష్ హెచ్చరించారు. చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 16 మంది పాత నేరస్తులను శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు పోలీసులకు సహకరించాలని సూచించారు.

40 మంది బైండోవర్

కల్హేర్(నారాయణఖేడ్): ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తుగా సిర్గాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 40 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామని కంగ్టి సీఐ జక్కుల హన్మంత్, ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. పాత కేసుల్లో ఉన్నా 40 మందిని గుర్తించి తహసీల్దార్ ఉమశంకర్ ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

నారాయణఖేడ్: ఐక్యతతోనే నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతాయని నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా కోఆర్డినేటర్ నరేందర్ అన్నారు. నారాయణఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నియోజకవర్గస్థాయి నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక సమావేశాన్ని ఖేడ్ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధ్యమన్నారు. నాయీబ్రాహ్మణులు ఐక్య నిర్ణయాలతో ముందుకు వెళ్లాలని తీర్మానించారు. ఆయా మండలాల బాధ్యులు సత్యనారాయణ, మారుతి, బాలాజీ, రవి, మశ్చేందర్, సుభాష్, సాయిలు, నారాయణ, అంజయ్య, అశోక్, నాగరాజు, సాయిలు, పీరాజీ, సోపాన్, గణపతి, ధన్‌రాజ్, రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాబోయే ఎన్నికల్లో పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. తెల్లాపూర్‌లో నైబర్‌హుడ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మందార నరేందర్‌రెడ్డి, నవారి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పెంటారెడ్డి, నవీన్ మిత్రబృందం కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌రావు, తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రవీందర్, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సుధాకర్‌రెడ్డి, తూర్పు శ్రీనివాస్, వడ్డే నరసింహ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ అధ్యక్షుడిగా ఏలియా

జహీరాబాద్ టౌన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జహీరాబాద్ నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ తెలిపారు. మూడు రోజులుగా పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏలియా, ఉపాధ్యక్షులుగా భాస్కర్, రోహిత్, ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శులుగా శ్రీధర్‌రెడ్డి, ఆకాష్, కోశాధికారిగా పాల్‌రాజ్, కార్యవర్గ సభ్యులుగా గణేష్, సంకేత్, హర్షిత్ దినేష్, నవీన్ ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బహురూపాల్లో అమ్మవారు దర్శనం

జిల్లావ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమీన్‌పూర్ మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారికి మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, జోగిపేట పట్టణంలో ప్రతిష్ఠించిన దుర్గమాతను రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ ప్రమోషన్ చైర్మన్ మఠం భిక్షపతి హాజరై పూజలు నిర్వహించారు.

– సంగారెడ్డి న్యూస్‌డెస్క్


పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి


జోగిపేట: జోగిపేట హనుమాన్ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న టీఎస్‌టీపీసీ చైర్మన్ భిక్షపతి, నాయకులు


జిన్నారం: వీరన్నగూడలో రాజరాజేశ్వరిదేవిగా..


సదాశివపేట: కన్యకా పరమేశ్వర అలయంలో..


మునిపల్లి: ఖమ్మంపల్లిలో బాలత్రిపుర సందరిదేవిగా..


మునిపల్లి: బుదేరా శివాలయంలో అమ్మవారు


సంగారెడ్డి టౌన్: ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో దుర్గాదేవిగా..

కందిసాగుతో అధిక లాభాలు

- పప్పుధాన్యం పంటలను పరిరక్షించుకోవాలి
- శాస్త్రవేత్త రమేశ్

జహీరాబాద్: కంది పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధికలాభాలు పొందవచ్చని శాస్త్రవేత్త వి.రమేశ్ అన్నారు. మొగుడంపల్లి మండలంలోని జమ్‌లైతండాలో డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో కంది పంటల సాగుతో పాటు లింగాకర్షక బుట్టలను వాడే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన కంది రకం హనుమ(టీడీఆర్‌జీ–4) ఫ్యూజేరియం ఎండు తెగులును తట్టుకుంటుందన్నారు. స్టేరిలిటీ మొజాయిక్ వైరస్ తెగులును కొంతవరకు, శనగపచ్చ పురుగును బాగా తట్టుకుంటుందని తెలిపారు. అదేవిధంగా మారుకా మచ్చల పురుగు, శనగపచ్చ పురుగును నివారించేందుకు గాను లీటరు నీటికి 5మిల్లీలీటర్ల వేప నూనె పిచికారీ చేయాలని సూచించారు. ఉధృతి ఎక్కువగా ఉంటే దశపర్ణి కషాయాన్ని 3 లీటర్లు ఎకరానికి సరిపోయే నీటిలో కలిసి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 8 లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు ఉధృతిని నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో భూసార పరీక్షల నిపుణుడు స్వామి డీడీఎస్ సూపర్‌వైజర్ చుక్కమ్మ, మహిళా రైతులు పాల్గొన్నారు.


లింగాకర్షక బుట్టల విధానంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రమేశ్

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని గెలిపించండి

పటాన్‌చెరు టౌన్: రాబోయే ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ కాలనీ, ఎంజీ రోడ్డులో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్ తదితర నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మెనిఫెస్టోలోని హామీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

‘బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరు’

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యే కుమారుడు గూడెం విక్రంరెడ్డి అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల పార్టీ యువజన సంఘాల నాయకులు, సోషల్‌మీడియా కమిటీ సభ్యులు, యువకులతో శనివారం గుమ్మడిలలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మడిదలలోని టోల్‌గేట్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విక్రంరెడ్డి మాట్లాడుతూ మూడోసారి ఎమ్మెల్యేగా మహిపాల్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు హుస్సేన్, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రభుత్వానికి పతనం తప్పదు

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గుమ్మడిదల మాజీ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డితో పాటు టీడీపీ, బీఆర్‌ఎస్, నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. బీఆర్‌ఎస్‌పై ప్రజలు ఓటు రూపంలో తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంరావు, శ్రీకాంత్‌రెడ్డి, వడ్డె కృష్ణ, మద్ది వీరారెడ్డి, నర్సింగ్‌రావు, ప్రతాప్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన నరేందర్‌రెడ్డి, నాయకులు

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని చాల్కి, రాఘవాపూర్, ముర్తుజాపూర్, చీకూర్తి గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్ అధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, నాయకులు భాస్కర్, పాండురంగారావు పాటిల్, బస్వరాజ్ పాటిల్, రత్నం, చంద్రశేఖర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణానికి చెందిన మజ్లిస్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ లుక్మాన్‌తో పాటు ఆయా పార్టీలకు చెందిన బషీరుద్దీన్, సత్తార్, షమాఖాన్, మూసా, అక్బర్ పాష, దశరథ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే ముస్లిం మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో తన గెలుపునకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంజీ రాములు, ఖాజామియా, జమీలుద్దీన్, జుబేర్, అక్బర్, మురళికృష్ణగౌడ్, అనంత్ నవీన్‌కుమార్, శుక్లవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో చంద్రశేఖర్

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): మండలంలోని బొడ్పట్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ నివాసంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ ఇన్‌చార్జిగా శంకర్

నారాయణఖేడ్: ముదిరాజ్ మహాసభ నారాయణఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఖేడ్ పట్టణానికి చెందిన అవుటి శంకర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు శనివారం పటాన్‌చెరులో నిర్వహించిన కార్యక్రమంలో శంకర్ ముదిరాజ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.


శంకర్‌కు నియామకపత్రం అందజేస్తున్న సంఘం జిల్లా బాధ్యులు

సర్పంచ్, కారోబార్‌పై కేసు

పటాన్‌చెరు టౌన్: పాటి గ్రామ సర్పంచ్, కారోబార్‌పై కేసు నమోదైన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలంలోని పాటి గ్రామానికి చెందిన ప్రతిమ అనే మహిళకు చెందిన సర్వే నెంబర్ 312(ఈ) భూమిలోకి సర్పంచ్ లక్ష్మణ్, కారోబార్ రామకృష్ణ శనివారం ప్రవేశించి అక్రమంగా రహదారి వేసేందుకు జేసీబీతో తొవ్విస్తుండగా ప్రతిమ అడ్డుకుంది. దీంతో తనను దుర్భాషలాడి చంపేస్తానని బెదిరించారని ప్రతిమ బీడీఎల్ భానూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ పండుగను శనివారం కనులపండువగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారుచేసి ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– సంగారెడ్డి న్యూస్‌డెస్క్


హత్నూర: చింతల్‌చెరువు గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


సదాశివపేట పట్టణం: చాపలకేరీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కన్‌సాన్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు


జహీరాబాద్ టౌన్: కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కంది: బతుకమ్మతో బ్యాతోల్ సర్పంచ్ శిరీష


రామచంద్రాపురం: రామచంద్రారెడ్డినగర్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

యువకుడు అదృశ్యం


శివరాం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన మడవత్ శివరాం (26) ఈ నెల 15న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో శివరాం కోసం ఆయన కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు అదృశ్యంపై తండ్రి కిషన్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూతురి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు


మమత

పటాన్‌చెరు టౌన్: కూతురి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ వీరమణి తెలిపిన వివరాల ప్రకారం పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ గ్రామానికి చెందిన భాగ్యమ్మ కూతురు మమత(23) శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి స్నాక్స్ తీసుకొస్తానని వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె తల్లి ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కూతురు అదృశ్యంపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా భవానీ శక్తిపీఠ పడిపూజ

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని బల్కంచెల్క తండా (భక్తిధాం తండా)లో భవానీ మాత అష్టదశ శక్తిపీఠ పడిపూజను శనివారం వైభవంగా నిర్వహించారు. తండాలోని విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మహామందిరంలో ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి మూడ్ కిషన్‌లలిత దంపతుల ఆధ్వర్యంలో పడిపూజ చేపట్టారు. పూజలకు నారాయణఖేడ్ ప్రాంతంలోని వివిధ తండాలకు చెందిన దీక్షదారులు భారీగా తరలివచ్చారు. ఎంపీటీసీ కిషన్, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, తండా ప్రముఖులు టీచర్ శంకర్, భవానీమాత దీక్షదారులు రూప్‌సింగ్, రాములు, సవాయ్‌సింగ్, మన్మోహన్‌నాయక్, కిషన్, జైల్‌సింగ్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ధర్మకర్త కిషన్‌సింగ్ దంపతులు

పోలీసు అమరులకు నివాళి

నారాయణఖేడ్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న పోలీసులు

భజన పోటీలకు శివానిస్వామి ఎంపిక


శివానిస్వామి

జహీరాబాద్ టౌన్: ఇండియన్ ఐడియల్ కాంటెస్ట్ శివానిస్వామి జహీరాబాద్ పట్టణంలో నిర్వహిస్తున్న భజన పోటీల్లో పాల్గొన్నారు. కర్నాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణానికి చెందిన శివానిస్వామి ఇండియన్ ఐడియల్ 14లో పోటీలకు ఎంపికై తన గానంతో దేశప్రజలను ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. పట్టణంలోని భవానీ మందిరంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర భజన పోటీల్లో శివానీస్వామి పాడిన భజన పాటలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ ఆమెను ఘనంగా సన్మానించారు.